www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 12 నవంబర్ 2023
5
అన్నమయ్య

అంజాద్‌కు ఉత్తమ అధ్యాపకుడి పురస్కారం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరుకు చెందిన డాక్టర్ అంజాద్ అలీబేగ్ ఉత్తమ ఉర్దూ అధ్యాపకుడి పురస్కారాన్ని అందుకున్నారు. భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని శనివారం విజయవాడలోని ఇందిరా గాంధీ స్టేడియంలో అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయంలోని ఉర్దూ విభాగంలో అకడమిక్ టీచింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పీలేరు వాసి డాక్టర్ అంజాద్ అలీ బేగ్ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఆయన ఉత్తమ ఉర్దూ అధ్యాపకుడి అవార్డు అందుకున్నందుకు అతని సన్నిహితులు, మిత్రులు అభినందనలు తెలియజేశారు.

పురస్కారం అందుకుంటున్న అంజాద్ అలీబేగ్

ఆకాశాన్నంటిన టపాసుల ధరలు

- లైసెన్స్ ఫీజుల పెంపుదలే కారణం
- బోసిపోయిన దుకాణాలు

టపాసుల దుకాణాల వద్ద తక్కువగా ఉన్న ప్రజల సందడి

ప్రజాశక్తి-రాయచోటి

దీపావళి పండుగ సామాన్య మధ్యతరగతి ప్రజలు చేసుకునేలా లేదు. టపాసుల ధరలు చూస్తే ముక్కున వేలు వేసుకోవాల్సిందే. బాణాసంచా ధరలు ఆకాశానంటుతుండటంతో అన్నమయ్య జిల్లాలో సందడి మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. గతంలో వారం, పది రోజుల ముందే దీపావళి పండుగ వాతావరణం కనిపించేది. వ్యాపారుల క్రాకర్స్ అమ్మకాలతో రాయచోటి పట్టణం నిండిపోయేది. ఈసారి దీపావళి పండుగ సమీపిస్తున్నా ఆ వాతావరణం కనిపించడంలేదు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా తాత్కాలిక షాపులకు 330 అనుమతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డులోని గ్రౌండ్‌లో 26 దుకాణాలు ఏర్పాటు చేశారు. లైసెన్స్ పొందాలంటే గత సంవత్సరం రాయచోటి జిల్లా కేంద్రం కావడంతో అధిక శాతం ఛార్జీలు పెంచారు. నేడు, రేపు ఈ దుకాణాలన్నీ ఆయా చోట్ల నడుపుకోవాల్సి ఉంటుంది. లైసెన్సు ఫీజులను భారీగా పెంచేయడంతో గత ఏడాది రోజుకు రూ.300 స్థలానికి బాడుగు ఉండేది. ఇప్పుడు రోజుకు రూ. వెయ్యి వరకు వసూలు చేస్తున్నారు. భారీ స్థాయిలో పెంచేశారంటూ పలువురు బాణసంచా వ్యాపారులు తీవ్ర ఆవేదనకు వ్యక్తం చేస్తున్నారు. రూ. లక్షలు ఖర్చు చేసి స్టాల్స్ ఏర్పాటు చేసుకున్నారు. గతంలో అత్యంత తక్కువ ధరలకు చైనా నుంచి బాణసంచాలు నాణ్యతని వచ్చేవి. ఈ సారి చైనా బాణసంచా తయారీని ఆ దేశంలో నిషేధించడంతో పూర్తిగా స్వదేశీ బాణసంచా అమ్మకాలే నిర్వహిస్తున్నారు. పైగా బాణసంచా ధరలు ఈ ఏడాది 20 శాతం పెరిగాయని పలువురు చెబుతున్నారు. ఈ ప్రభావం తీవ్రంగా ప్రజలపై పడే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై స్పందించి సరైన ధరలకు బాణాసంచాలను అమ్మకాలు చేసే విధంగా చర్య తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

వ్యాపారులు అధిక రేటుకు అమ్ముతున్నారని ప్రజలు ఎవ రైనా ఫిర్యాదు చేస్తే రెవెన్యూ, పోలీస్, తమ అగ్నిమాపక సిబ్బందితో కలిసి చర్య తీసుకోవడానికి తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. దీపావళి పండుగ ప్రశాంతంగా నిర్వహించుకోవడానికి అన్ని చర్యలు తీసుకున్నాం.

- పి.అనిల్‌కుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి, రాయచోటి, అన్నమయ్య జిల్లా.

ఆర్‌యుబి సాధనే లక్ష్యం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రైల్వే అండర్ బ్రిడ్జి సాధనే తమ లక్ష్యమని ఆర్‌యుబి సాధన సమితి సభ్యులు పేర్కొన్నారు. శనివారం వారు రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలించి ప్రభుత్వ నిర్లక్ష్యానికి అక్కడే నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాధన సమితి నాయకులు మాట్లాడుతూ రైల్వే అండర్ బ్రిడ్జి సదుపాయం లేక ఫ్లైఓవర్‌పై ప్రయాణం చేస్తూ ప్రజలు ప్రమాదాల భారిన పడుతున్నారన్నారు. బ్రిడ్జికి ఆవల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలు ఉండడంతో ప్రతి నిత్యం ఈ దారిలో విద్యార్థులు, ప్రజలు వేలాదిమంది ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో పోరాటాలు చేయడం ద్వారా అండర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.9 కోట్లు మంజూరు చేయడంతో 90 శాతం పనులు పూర్తయ్యాయని, వైసిపి ప్రభుత్వం మిగిలిన 10 శాతం పనులు కూడా పూర్తి చేయలేక నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. రెవెన్యూ, పురపాలక శాఖ వారు ఒకరి మీద ఒకరు నెపం వేసుకుంటూ జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ఒక మాసంలోపు రైల్వే బ్రిడ్జి పనులు పూర్తి చేయకపోతే ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చిట్వేలి రవికుమార్, నాగోతు రమేష్ నాయుడు, కొల్లి రెడ్డెయ్య, వెంకటేష్, సుబ్బారాయుడు, సత్య కుమార్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిని పరిశీలిస్తున్న సాధన సమితి సభ్యులు

మైనార్టీలను మోసగించిన సిఎం జగన్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె

భారతదేశ చరిత్రలో మైనార్టీలను అన్నివిధాల తీవ్రంగా మోసం చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అని మదనపల్లె మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెప్మా మహిళలను వేధించి, భయపెట్టి ప్రభుత్వ కార్యక్రమాలకు వినియోగించిన ఏకైక ఎమ్మెల్యే నవాజ్ బాషా అని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రం బాగుపడాలంటే మళ్లీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు నవీన్ చౌదరి, నాదేళ్ల శివప్రసాద్, బాలుస్వామి, సీడ్స్ రమణ, నాగూర్ వల్లి,పూలకుంట్ల హరి, నాగమణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం

- అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకల్లో కలెక్టర్ గిరీష

అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

భారతదేశ విద్యా వ్యవస్థకు పునాదులు వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని ఆయన 136వ జయంతి సందర్భంగా కలెక్టర్ గిరీష పిఎస్ పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక ఎస్‌పి కార్యాలయంలో భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవం, జాతీయ మైనారిటీ సంక్షేమ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ గిరీష పిఎస్, ఎస్‌పి కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీష మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, స్వతంత్ర భారతదేశంలో మొదటి విద్యా శాఖ మంత్రి అయినా మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారత దేశ విద్యా వ్యవస్థకు పునాదులు వేశారని, యుజిసి, ఐఐటి, ఐఐఎంల స్థాపనలో కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. విద్యావ్యవస్థకు పునాదులు వేయడమే కాకుండా దేశంలో మత సామరస్యానికి ప్రత్యేకగా నిలిచారని తెలిపారు. ఆయన చేసిన సేవలకు గాను 1992లో ఆయనకు భారతరత్న పురస్కారంతో సత్కరించారన్నారు. ఎస్‌పి కృష్ణారావు మాట్లాడుతూ మతసామరస్యాన్ని, ఉచిత విద్య ప్రాముఖ్యతను దేశానికి చాటిన నాయకుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని కొనియాడారు. జిల్లా ప్రజలందరూ మతసామరస్యంతో మెలగాలని పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్లోని స్పందన హాల్‌లో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషతో సహా పలువురు ప్రజా ప్రతినిధులు జాతీయ విద్యా దినోత్సవాన్ని, మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో.. డిసిసి అధ్యక్షులు షేక్ అల్లాబకష్ ఆధ్వర్యంలో అబుల్ కలాం ఆజాద్ 135వ జయంతిని పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు చెన్న కృష్ణ, ఆర్‌టిఐ అమీర్, జిల్లా సెక్రెటరీ యహియా బాషా మీడియా చైర్మన్ నరేష్, మాజీ పట్టణ అధ్యక్షుడు దర్బార్‌బాషా, మండల అధ్యక్షులు రమణ, నూరుల్లా. ఎండి రఫీ పాల్గొన్నారు. **సుండుపల్లి :** మొదటి విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని మండలంలోని ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఎంఇఒ రవీంద్రానాయక్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు ఆరిపుల్లా, గణపతి, భీంలానాయక్, మహబూబ్ బాషా, ఇస్మాయిల్, మణికంఠ, కృష్ణా నాయక్ పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అబుల్ కలాం ఆజాద్ జయంతిని నియోజకవర్గ ఇన్‌ఛార్జి గోసాలదేవి, ఎస్‌సిసెల్ కన్వీనర్ శాంతయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోసాలదేవి మాట్లాడుతూ ఆజాద్ స్వతంత్ర సమరయోధుడని, పండిట్ నెహ్రూ మంత్రివర్గంలో విద్యాశాఖను చేపట్టి విద్యారంగంలో నూతన సంస్కరణలను చేపట్టారన్నారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు ఎస్‌సిసెల్ కన్వీనర్ బొమ్మనబోయిన నాగరాజు, మహిళా నాయకురాలు లక్ష్మీదేవి, మండల నాయకులు బ్రహ్మయ్యలు పేర్కొన్నారు. **కలికిరి:** శ్రీనివాస జూనియర్ కళాశాలలో విద్యార్థి నాయకుడు మాలతోటి నరేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆజాద్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఖాదర్‌బాషా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **మదనపల్లె:** కాంగ్రెస్ పార్టీ మదనపల్లె నియోజకవర్గ నాయకులు రెడ్డి సాహెబ్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంనందు అబుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ మన భారతదేశ స్వాతంత్ర్య పోరాట యోధుడన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూముల భద్రత పక్కాగా ఉండాలి : గిరీష

స్ట్రాంగ్ రూములను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

సార్వత్రిక ఎన్నికలు 2024కు సంబంధించి ఇవిఎంల కోసం ఏర్పాటు చేయబోయే స్ట్రాంగ్ రూముల భద్రత పక్కాగా ఉండాలని కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. శనివారం ఉదయం ఆయన పట్టణంలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేయబోయే స్ట్రాంగ్ రూములను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూములు ఎలాంటి లోపాలు ఉండరాదని పోలీస్‌శాఖకు సూచించారు. పటిష్టంగా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటుకు సహకరించాలని కళాశాల యాజమాన్యాన్ని కోరారు. ఆయన వెంట ఎస్‌పి కృష్ణారావు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, వివిధ పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్‌డిఒ మురళీ

హార్సిలీహిల్స్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆర్‌డిఒ ఎం.ఎస్.మురళి స్పష్టం చేశారు. శనివారం ఆయన హార్సిలీహిల్స్‌లో తహసిల్దార్ రఫీక్ అహ్మద్, ఎస్‌ఐ రామ్మోహన్‌తో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ముఖ్యంగా హార్సిలీహిల్స్ కొండపై అక్రమ కట్టడాలను నిర్మూలి స్తామని చెప్పారు. గతంలో కలెక్టర్ గిరీష ఆదేశాల మేరకు అక్రమ కట్ట డాలను తొలగించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. టౌన్‌షిప్ అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. హార్సిలీహిల్స్‌కు వచ్చి పోయే వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచామని 16 సిసి కెమెరాలను ఏర్పాటు చేశామ న్నారు. అంతేకాకుండా కొండపై పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత నిస్తు న్నామని, పర్యాటకశాఖ సిబ్బందితో గాలిబండ తదితర ప్రాంతాలలో పారిశుధ్య చర్యలు ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు. దేశం లోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో ఇక్కడికి విచ్చే స్తుంటారని వారి భద్రత కోసం ప్రత్యేక పర్యవేక్షణ, నిఘాను పోలీస్ శాఖ ద్వారా ఏర్పాటు చేయ డం జరిగిందన్నారు. హార్సిలీహిల్స్ ను మరింత అభి వృద్ధి చేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడమే లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్ర మంలో పర్యాటకశాఖ అధికారులు, కోటావూరు విఆర్‌ఒ నరేంద్ర పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అతికారి దినేష్

జనసేనకు అధికారమివ్వండి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రాభివృద్ధికి జనసేనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని జనసేన నాయకులు అతికారి దినేష్ కోరారు. శనివారం పట్టణ శివారులోని న్యూ ఆంధ్ర కల్యాణ మంటపంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ క్రియాశీలక కమిటీలు నిర?యించారు. ఈ సందర్భంగా అతికారి దినేష్ మాట్లాడుతూ రాష్టంలో రాక్షస పాలన సాగుతోందని అన్నారు. అధికార పార్టీ దుర్మార్గాలు, దౌర్జన్యాలు, ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో పాలన అస్తవ్యస్థంగా ఉందని, వీటిపై ప్రశ్నించినవారిని అడ్డగోలు, అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర పరిస్థితి గాడిన పడాలంటే పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి కావాలన్నారు. ప్రతి కార్యకర్త సమిష్టి కృషి చేసి జనసేనను అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ముకరం చాన్, కోలాటం హరి, వెంకటేశ్వరరావు, బాల సాయి, అబ్బిగారి గోపాల్ పాల్గొన్నారు.

సైంటిఫికల్ ప్రాజెక్ట్ ఎక్స్‌పోను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈనెల 28,29న నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో ప్రీ ఫోన్ చేసి 24, 25 తేదీలలో రాయచోటిలో ఘనంగా నిర్వహించబోతున్న కలామ్స్ విజన్-2023 సైంటిఫికల్ ప్రాజెక్ట్ ఎక్స్ పోను విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరాం పురుషోత్తం, ప్రోగ్రాం డైరెక్టర్ వినయ్ కుమార్ తెలిపారు. శని వారం విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ప్రోగ్రాం డైరెక్టర్ వినయ్ కుమార్ రూపొందించిన కలామ్స్ విజన్ సైంటిఫికల్ ఎక్స్‌పో నూతన కరపత్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ఆవిష్కరించారు. విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచనల పెంపొందించడానికి సైంటిఫికల్ ప్రాజెక్ట్ ఎక్స్ పో ఉపయో గకరంగా ఉంటుందని తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా హై స్కూల్ స్థాయి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం ప్రోగ్రాం డైరెక్టర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్, కార్పొరేట్ గవర్నమెంట్, విద్యార్థులందరూ తమ ప్రాజెక్టులను ప్రదర్శించవచ్చు అన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 6281453550, 9391932752లలో సంప్రదించాలన్నారు. ప్రాజెక్ట్ రూపొందించిన ప్రతి విద్యార్థికీ ప్రశంస పత్రం, జ్ఞాపికను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉండే ప్రతి ఒక్క పాఠశాల నుండి విద్యార్థులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డిఇఒ పురుషోత్తం

మొక్కుబడే!

ప్రజా'దృష్టి'

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన మొక్కుబడిగా సాగింది. పులివెందుల అభివృద్ధి పనుల పరిశీలన, వేముల మండల నాయకులతో సమావేశం, వివాహ కార్యక్రమాల హాజరుకే పరిమితమయ్యారు. జిల్లా ఎదుర్కొంటున్న తీవ్ర కరువు పరిస్థితులపై నెలకొన్న ఆందోళనల్ని విస్మరించి, వ్యక్తిగత ఎజెండాకు పరిమితం కావడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగించింది. రాష్ట్ర వ్యాప్తంగా 330 మండలాల్లో కరువు విలయతాండవం చేస్తోందని, ఇందులో 103 మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా గుర్తిం చడమేమిటనే విమర్శల వర్షం కురుస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యమంత్రి తన సొంత జిల్లా కరువు మండలాల గుర్తింపునకు నోచుకోలేదు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా కరువు పరిస్థితులను పరిశీలిస్తారని ఆశించిన రైతాంగానికి నిరాశే మిగిలింది. జిల్లాలో ఒక వైపు కరువు పరిస్థితులు, మరోవైపు పారిశ్రామిక అభివృద్ధి మందగించిన నేపథ్యంలో తీవ్రఅనిశ్చిత పరిస్థితులు ఎదుర్కొంటున్న అరుదైన సమయంలో నిరుత్సాహపూరిత పర్యటన సాగించడం నిరుత్సాహాన్ని కలిగించింది. కడప, అన్నమయ్య జిల్లా అధికార యంత్రాంగాలు కడప జిల్లాలో 17, అన్నమయ్య జిల్లాలో 23 మండలాల్లో కరువు నెలకొందని ప్రతిపాదనలు పంపిన తెలిసిందే. దీనికి కొర్రీలు వేయడం అభ్యంతరకరం. కరువు మండలాల గుర్తించక పోవడానికి ప్రత్యామ్నాయంగా ఏమిచేయాలనే అంశంపై సమాలోచనలు సైతం సాగించకపోవడం అయోమయాన్ని కలిగించింది. రైతు ప్రభుత్వమని ఢంకా భజాయించుకునే పాలకులు రైతును నిర్లక్ష్యం చేయడం తగనిపని. ఇదేతరహాలో ఫిబ్రవరిలో జిల్లాలోని జమ్మలమడుగులోని సున్నపురాళ్లపల్లి దగ్గర ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు శిలాఫలకం ఏర్పాటు చేసి వెళ్లిపోయారు. కడప జిల్లా ప్రగతి రూపు రేఖలను తీర్చిదిద్దగల ఉక్కు పరిశ్రమ అభివృద్ధి పనుల్ని పరిశీలించి ఉంటే బాగుండేది. ఇటువంటి శాశ్వతమైన అభివృద్ధి పనుల్ని విస్మరించి, అనుత్పాదక పనులైన భవన నిర్మాణాలు, దేవాలయాల పరిశీలన, ప్రారంభోత్సవాలకు పరిమితం కావడం ఆందోళనకరం. శాశ్వత అభివృద్ధి పనుల్ని చేపట్టి వాటి ఫలితాలను సమాజానికి అందించే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొప్పర్తి పారిశ్రామికవాడను దశాబ్దాల తరబడి పీడిస్తున్న ఎన్విరాన్‌మెంటల్ అనుమతి, బ్రహ్మసాగర్ నుంచి పరిశ్రమను నీటి సదుపాయాల పనుల పురోగతిని పరిశీలించాల్సి ఉంది. ఇటువంటి శాశ్వత అభివృద్ధి పనుల్ని పరిశీలించకుండా, అనుత్పాదక పనుల పరిశీలన కారణంగా దార్శనికత లోపించిందనే చెప్పాలి. 2021 నవంబర్‌లో దెబ్బతిన్న అన్నమయ్య రిజర్వాయర్ పనుల్ని పరిశీలించి ఉంటే లోతట్టు గ్రామాల ప్రజల్లో ఆదరణ లభించి ఉండేది. జిల్లాలోని కరువు పరిస్థితుల పరిశీలన, వరద పాలైన సాగునీటి ప్రాజెక్టులు, ఉత్పాదక వ్యయంతో కూడిన ఉక్కు పరిశ్రమ, పారిశ్రామికాభివృద్ధికి ఇరుసుగా పేరొందిన కొప్పర్తి పారిశ్రామికవాడ మౌలిక సదుపాయాలను పరిశీలించి, వాటి పునరుద్ధరణ, ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపి ఉంటే బాగుండేది. ఇటువంటి దూరదృష్టితో కూడిన పర్యటన చేపట్టి ఉంటే భవిష్యత్ తరాలకు మేలు చేసినట్లు అయ్యేది. జిజిహెచ్ సూపర్‌స్పె షాలిటీ, ఆర్కిటెక్షర్ యూనివర్శిటీ అభివృద్ధి పనుల పరిశీలన చేపట్టాల్సిన అవసరం ఉండేది. ఇటువంటి శాశ్వత అభివృద్ధి పనుల్ని విస్మరించి, అనుత్పాదక వ్యయాలను పరిశీలన చేయడం వల్ల ఎటు వంటి ప్రయోజనమూ ఉండదని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

శస్త్ర చికిత్సకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్విరామంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తగాది రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ కర్ణాటకరాష్ట్రం, బాగేపల్లి, కదిరిన్నగారిపల్లిలో నివాసమున్న శకుంతలమ్మ కొన్నేళ్లుగా వరికోసువ్యాధితో బాధపడుతోందని పేర్కొన్నారు. కదిరిన్నగారిపల్లి మంజునాథ్ యంగ్ఇండియా సేవాఫౌండేషన్ ఆశ్రయించారని చెప్పారు. ఎంవిజె ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి రూ.80 వేలు ఫౌండేషన్ ద్వారా చెల్లించి ఆపరేషన్ ఉచితంగా చేయించినట్లు తెలిపారు. ఆపదలో ఉన్న వారికి యంగ్ఇండియా ఫౌండేషన్ సంస్థ బాసటగా నిలుస్తోందని కొనియాడారు.

శకుంతలమ్మతో మాట్లాడుతున్న డాక్టర్

ఆలయాభివృద్ధికి సహకరిస్తాం : 'గంటా'

- నరసింహస్వామికి వెండి కిరీటం బహూకరణ
- రాజగోపురానికి రూ.15 లక్షలు
- అన్నదానానికి రూ.2 లక్షలు వితరణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణ పరిధిలోని భువనగిరిపల్లెలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ప్రముఖ పారిశ్రామికవేత్త, టిడిపి పార్లమెంట్ అభ్యర్థి గంటా నరహరి తెలిపారు. శనివారం ఆయన సతీసమేతంగా నరసింహ స్వామిని దర్శించుకుని స్వామివారికి వెండి కిరీటం బహూకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆయనకు మేళతాళాల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. శాలువా, గజమాలతో ఘనంగా సత్కరించి ఆలయంలో ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్కభజన, భక్తి పాటలు అహూతులను అలరించాయి. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గంటా నరహరి మాట్లాడుతూ స్వామి వారి కృపాకటాక్షాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. తన రాజకీయ ప్రస్థానంలో ప్రజలు తమ వెంట ఉండి మద్దతు తెలపాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన ఈ ఆలయానికి రాజగోపురం లేకపోవడం లోటుగా ఉందని నరహరి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఆయన ఆలయ గోపురం నిర్మాణానికి రూ.15 లక్షలు ప్రకటించారు. అన్నదానానికి గాను రూ.2 లక్షలు నగదు అందజేశారు. జనసేన పార్టీ అసెంబ్లీ ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ రాజగోపురానికి తన వంతుగా రూ.5 లక్షలు విరాళం అందజేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో టిడిపి మండల రూరల్ అధ్యక్షులు గన్నే సుబ్బ నరసయ్య నాయుడు, సుధాకర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఎం.ఎల్ నరసయ్య, కె.ఎస్.నరసింహ, పూల హరిప్రసాద్, నామాల రాజశేఖర్, కావేరిగారి వెంకటరమణ, కొమ్మూరు సుబ్బనరసయ్య, జనసేన నాయకులు కోలాటం హరి, వెంకటేశ్వర్లు, అబ్బిగారి గోపాల్ పాల్గొన్నారు.

వెండి కిరీటం సమర్పిస్తున్న గంటా నరహరి

టపాసుల దుకాణంలో నీటి డ్రమ్మును పరిశీలిస్తున్న పోలీసులు

దుకాణదారులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువు సర్కిల్ పరిధిలో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారు తప్పని సరిగా నియమ నిబంధనలు పాటించాలని సిఐ తమ్మిశెట్టి మధు సూచించారు. శనివారం ఆయన ములకలచెరువులోని క్రికెట్ మైదానంలో ఏర్పాటు చేసిన టపాసులు దుకాణాలను పరిశీలించి దుకాణదారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఒక్కో టపాసుల దుకాణానికి సుమారు 10మీటర్ల దూరం ఉండాలని, దుకాణాలకు దూరంగా వాహనాలు నిలిపి టపాసులు కొనుగోలు చేయాలన్నారు. దుకాణాల వద్ద తప్పని సరిగా రెండు డ్రమ్ముల నీటిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే ఆ దుకాణాలను సీజ్ చేస్తామని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ గాయత్రి, సిబ్బంది శంకర్‌నాయక్, సిరాజ్, లక్ష్మిపతి పాల్గొన్నారు.

విలక్షణ నటుడు చంద్రమోహన్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

చంద్రమోహన్‌తో జింకా సుబ్రహ్మణ్యం (ఫైల్ ఫొటో)

చిత్రసీమలో 932 చిత్రాలలో నటించిన విలక్షణ నటుడు చంద్రమోహన్ అని, ఆయన లేనిలోటు తీర్చలేనిదని జిల్లా రచయిత సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం సంతాపం ప్రకటించారు. శనివారం చంద్రమోహన్ మరణవార్త విని దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రంగులరాట్నం చిత్రంతో రంగప్రవేశం చేసి పదహారేళ్ల వయసు, సిరిసిరిమువ్వ, శుభోదయం, జీవనతరంగాలు, శంకరాభరణం వంటి అనేక చిత్రాల్లో నటించి ప్రేక్షక హృదయాల్లో శాశ్వతస్థానం పొందారన్నారు. 1990, 1994 సంవత్సరాల్లో ప్రొద్దుటూరు రవికళానికేతన్ వార్షికోత్సవాల్లో రెండుసార్లు పాల్గొన్నారని గుర్తు చేశారు. ప్రొద్దుటూరు కళాకారులతో పరిచయం ఉన్నందున కర్నాటకలో షూటింగ్‌కు వెళ్లేటప్పుడు తమల్ని ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌కు పిలిపించుకొని మాట్లాడారని గుర్తుచేసుకున్నారు. చంద్రమోహన్ మరణం పట్ల సంతాపం ప్రకటిస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని జింకా తెలిపారు.

జాబ్‌మేళాలో 22 మంది ఎంపిక

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్థానిక రాణీ తిరుమలదేవి డిగ్రీ కళాశాలలో హెటిరో ల్యాబ్స్ వారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 22మంది ఎంపికయ్యారని ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆ ల్యాబ్స్ హెచ్ ఆర్ గొల్లపల్లి సిమాన్, సమీర్ ఇంటర్వ్యూలు నిర్వ హించారు. డిగ్రీ, ఎంఎస్సీ, ఫార్మసీ పూర్తయిన 48 మంది హాజరయ్యార న్నారు. తమ కళాశాల నుండి 13 మంది విద్యా ర్థులు ఎంపి కవ్వడం ఆనం దకరమన్నారు. వీరు ఈనెల 15న జాయిన్ అవ్వా ల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాం డెంట్ తరుణేందు శేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఐడిపిఎస్‌లో వైద్య శిబిరం

చాపాడు : స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో శనివారం పాఠశాల బస్సు డ్రైవర్లకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు కంటి పరీక్షలు, బిపి, షుగర్ వంటి సమస్యలకు తగు జాగ్రత్తలు తెలిపారు. అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు ఉచితంగా అందజేశారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ వి జయచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ బి.రవీంద్ర, సిబిఐటి ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులరెడ్డి, రోటరీ క్లబ్ కార్యదర్శి గజ్జల వెంక టేశ్వరరెడ్డి, ఎం.సూర్యనారాయణరెడ్డి, కె.రవికుమార్‌రెడ్డి, జి.రామకృష్ణ, రోటరీ క్లబ్ మేనేజర్ అరుణ, వైద్యులు వశిష్ఠ, నరసింహారెడ్డి, చాందిని బేగం పాల్గొన్నారు.

పేదరికంపై గెలవాలంటే విద్య ఒక్కటే మార్గం

ప్రొద్దుటూరు : పేదరికంపై గెలవాలంటే విద్య ఒక్కటే మార్గమని 33వ వార్డు కౌన్సిలర్ గాజుల శివజ్యోతి, కార్మిక నేస్తం సంఘం అధ్యక్షులు కుతుబుద్దీన్ పేర్కొన్నారు. రోజి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం మౌలానా అబుల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎస్‌వివి బాలుర ఉన్నత పాఠశాలలో 33వ వార్డు ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేఈతలకు బహుమతలు అందజేశారు. 34వ వార్డు ఇన్‌ఛార్జి నీలాపురం బాషా, 33వ వార్డు అధ్యక్షులు బేల్దార్ బాషా పాల్గొన్నారు.

గండిక్షేత్రానికి పాదయాత్ర

ప్రజాశక్తి - వేంపల్లె

అయ్యప్ప స్వాములు వేంపల్లె నుంచి గండిక్షేత్రం వరకు పాదయాత్ర చేశారు. శనివారం రామ్మోహన్ గురుస్వామి ఆధ్వర్యంలో అయప్ప స్వాములు అందరూ గండి వీరాంజనేయ స్వామి దేవస్థానం వరకు అయ్యప్ప నామస్మరణతో పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో ధృవకుమారెడ్డి, సుబ్బారెడ్డి, ఆర్‌కె బద్రీ, జయరామిరెడ్డి, మోహన్‌రెడ్డి, మధురెడ్డి పాల్గొన్నారు.

అమృత్‌నగర్‌లో టిడిపి శ్రేణుల పర్యటన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు రూరల్ మండలం అమృత్‌నగర్‌లో టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జి.వి.ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం బాబు ష్యూరిటీ-భవిష్యతు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆయన భార్య మౌనిక, అక్క హరిత నిర్వహించారు. ఈ సందర్భంగా వారు టిడిపి ప్రకటించిన పథకాలను ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు రూలర్ మండల కన్వీనర్ బోడెల బాబుల్ రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసుల యాదవ్, ప్రొద్దుటూరు పట్టణ మహిళా అధ్యక్షురాలు భోగాల లక్ష్మీనారాయణమ్మ, పాల సుబ్బరాయుడు, ఫక్రుద్దీన్, ఆర్ఎంపి ప్రసాద్, బోనం శ్రీను, జాఫర్, సాయి, భానుమతి, దేవి, హుస్సేన్ పీర్, చిన్న, కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆవులు దస్తగిరయ్య పాల్గొన్నారు.

అనాథలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ తనయుడు, టిడిపి నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ జన్మదినం సందర్భంగా కెఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రోడ్లపై ఉన్న అనాథలు, అభాగ్యులకు దుప్పట్ల పంపిణీ చేశారు. కేక్ కటింగ్ చేసి పంపిణీ చేశారు. చలికాలం దృష్టిలో పెట్టుకొని కొంతమందికైనా సాయం చేయాలనే ఆలోచనతో దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ కదిరి సంజీవ రాయుడు యాదవ్ పాల్గొన్నారు.

చాపాడు మండలం అవధూత కాశినాయన స్వామి అనాథాశ్రమంలో పుట్టా సుధాకర్ యాదవ్ తనయుడు పుట్టా మహేష్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా శని వారం పండ్లు, బ్రెడ్, కేక్ పంపిణీ చేశారు. కార్య క్రమంలో రవిశంకర్‌రెడ్డి, బుర్రి నాగరాజు, కిరణ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నారా యణరెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

మైదుకూరులో.. పుట్టా మహేష్ యాదవ్‌కు జన్మదినశుభాకాంక్షలు తెలియజేస్తూ వెంకటసుబ్బయ్య చెంచుకాలనీలో కొండపల్లి ఉమాకాంత్ బ్రదర్స్ చీరెలు పంపిణీ చేశారు. గుత్తి నారాయణ యాదవ్, బద్రిపల్లె సర్పంచ్ మల్లేశ్వరి భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆకుల కృష్ణయ్య, రమేష్, వీరారాజు, పెరుగు కృష్ణయ్య , భూమాయపల్లి సర్పంచ్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

పట్టణ పరిధిలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఎర్రబెల్లి తండా విద్యార్థులచే క్లాసికల్, జానపద కార్యక్రమాలను ప్రదర్శిం చనున్నట్లు తెలిపారు.

టపాసుల ధరలకు రెక్కలు

నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలు

ప్రజాశక్తి-నందలూరు

దీపావళి పండుగకు టపాసులు కాల్చడం ఆనవాయితీ, తల్లి తండ్రులు పటాకాయలు తెచ్చేంత వరకు పిల్లలు గోల చేయడం, వాటిని తెచ్చాక కాల్చుతూ సంతోషపడడం షరా మామూలే. కానీ ఈ ఏడాది టపాసుల దుకాణాలకు వెళ్లిన కొనుగోలుదారులు అక్కడి ధరలను చూసి బెంబేలెత్తుతున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల వారు సంతోషంగా కొనుగోలు చేసేందుకు వెళ్లి అక్కడి ధరలు చూసి కోనలేక బాధతో తిరుగు ముఖం పడుతున్నారు. టపాసుల అమ్మకాలలో నియంత్రణ ఎక్కడ అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇష్టం వచ్చిన ధరలకు అమ్మకాలు చేపట్టడంతో పాటు, ధరల సూచిక బోర్డులను కూడా ఏర్పాటు చేయలేదు. దీంతోపాటు నాసిరకం పటాసులు అమ్ముతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇది కాక టపాసుల యజమానులు నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలను ఏర్పాటు చేశారు. హైవే రోడ్డుకు 60 అడుగుల దూరంలో ఏర్పాటు చేయాలన్న 20 అడుగుల దూరంలో ఏర్పాటు చేశారు. ప్రతి దుకాణానికి మధ్యన 10 అడుగుల దూరం ఉండాలన్న నిబంధనకు తూట్లు పొడిచారు. అధికారులకు ముడుపులు ముట్టడం వల్లే యజమానులు ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుకుంటున్నారు. అధిక ధరలు, నిబంధనలపై స్థానిక తాసిల్దార్ను ఫోనులో వివరణ కోరేందుకు సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

బోసిపోయిన దుకాణాలు

కలకడ : అధిక రేట్లతో టపాసులను విక్రయిస్తుండడంతో టపాకాయల దుకాణాలు బోసిపోతున్నాయి. మండల కేంద్రమైన కలకడలోని స్థానిక వారపు సంత జరిగే ప్రాంతంలో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేశారు. టపాకాయల రేట్లు అధికంగా ఉండటంతో గ్రామాలలోని ప్రజలు టపాకాయలు కొనేందుకు ముందుకు రాకపోవడంతో దుకాణములన్ని ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ప్రతి ఏడాది కంటే ఈఏడాది రేట్లు అధికంగా విక్రయిస్తుండటంతో కొనలేకపోతున్నా మని స్థానిక ప్రజలు చెబుతున్నారు.

ఖాళీగా దర్శనమిస్తున్న టపాసుల దుకాణాలు

టిడిపితోనే భవిష్యత్తుకు గ్యారెంటీ : మాజీ ఎమ్మెల్యే

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

టిడిపి ప్రభుత్వ హయాంలోనే రాష్ట్ర భవిష్యత్తుకు షూరిటీ ఉంటుందని మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని బడికాయలపల్లిలో బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శంకర్‌యాదవ్ పాల్గొని మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే మహిళలకు న్యాయం జరుగుతుందని, ఆరు గ్యారెంటీల ప్రతిపాదనతో తాము ముందుకు వెళ్తున్నామని అన్నారు. మహాశక్తి అనే కార్యక్రమం కింద ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1500, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పేరుతో చదువుకుంటున్న ప్రతివిద్యార్థికి సంవత్సరానికి రూ.15 వేలు , మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ,రైతన్నలకు ప్రతి సంవత్సరం రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. యువగళం పేరుతో నిరుద్యోగులకు నెలకి రూ.3 వేలు నిరుద్యోగ భృతి అందిస్తామని చెప్పారు. రెండు వేల కోట్ల రూపాయలతో తంబళ్లపల్లిని టిడిపి హయాంలోనే అభివృద్ధి చేసి చూపించామన్నారు. ఇప్పుడు జరుగుతున్నటువంటి రోడ్లుగాని, మరమ్మతులుగానీ తాము అధికారంలో ఉన్నప్పుడు తెచ్చినవేనని స్పష్టం చేశారు. వైసిపి ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని, వచ్చే శాసనసభ ఎన్నికల్లో సైకిల్ ప్రభంజనం సృష్టించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు నారాయణస్వామిరెడ్డి, మాజీ ఎంపిటిసి సిద్ధప్పనాయుడు, టిడిపి పట్టణ అధ్యక్షుడు బంగారు వెంకటరమణ, మైనార్టీ నాయకుడు మస్తాన్, మాజీ ఉపసర్పంచ్ షమీవుల్లా, ఆలేటిపల్లి శ్రీనాథ్, సుకుమార్, జనసేన నాయకుడు నాగరాజు, బడికాయలపల్లి టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కన్నీరు తెప్పిస్తున్న ఉల్లి ధరలు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

రోజు, రోజుకూ ఉల్లిగడల ధరలు పెరుగుతుండడంతో సామాన్యుడికి వాటిని కొనకుండానే కన్నీరు తెప్పిస్తున్నాయి. నెల రోజుల నుంచి ఉల్లి ధరలు పైపైకి పోతూనే ఉన్నాయి. డిమాండ్ స్థాయిలో లభ్యత లేక పోవడం, తగినంతగా వర్షాలు కురవ కపోవడంతో ఉల్లి సాగు తగ్గి.. దిగుబడి పడి పోయింది. గత ఏడాది అక్టోబర్‌లో కిలో ఉల్లి ధర రూ.10 నుంచి రూ.15 మధ్యలో ఉండేది. గిట్టుబాటు ధర రావడం లేదని చాలా మంది రైతులు సాగు చేయక పోవడంతో ఉల్లి సాగు గణనీయంగా పడిపోయింది. ప్రస్తుతం ఉల్లి ధరలు పెరుగుతున్నాయి. 2018లో ఉల్లి ధర రూ.75 నుంచి రూ.80 వరకు పెరిగింది. మళ్లీ ఇప్పుడు కూడా అదే పరిస్థితి నెలకొంది. మరో వైపు ధర ఎంతైనా ప్రతి వంటలో ఉల్లిగడ్డ పడితే కానీ కుదరని పరిస్థితి. ఈ మధ్య కాలంలోనే టమోటా ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఇప్పుడు ఉల్లి ధరలది కూడా అదే పరిస్థితి. మార్కెట్‌లో ఉల్లిధర రూ.70కి చేరింది. రోజురోజుకూ ఉల్లి ధరలు పెరుగుతుండంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ఉల్లి లేకుండా వంటలను చేయాలంటే ఇబ్బందులు పడుతున్నామని గృహిణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఉల్లి ధరలను తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి

డిఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న శివకుమార్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పులివెందుల, చాగలమర్రి, శ్రీశైలం వంటి ప్రాంతాల బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివనారాయణ, గండికోట చారిటబుల్ ట్రస్టు చైర్మన్, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వై.చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. ఆయా ప్రాంతాలకు బస్సులను నడపాలని డిపో మేనేజర్‌కు శనివారం వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా రాక మునుపు జమ్మలమడుగు నుంచి పైన పేర్కొన్న ప్రాంతాలకు బస్సు సర్వీసులు ఉండేవన్నారు. కరోనా తర్వాత అనేక సమస్యలను చెబుతూ తొలగించడం సరైంది కాదన్నారు. జమ్మలమడుగు నుండి శ్రీశైలం, చాగలమర్రి ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రొద్దుటూరు నుంచి వెళ్లాల్సి ఉందన్నారు. ఇది ప్రయాణికులకు ఆర్థికభారంతోపాటు సమయం వృథా అవుతోందని వివరించారు. జమ్మలమడుగు నుండి పులివెందులకు వెళ్లాలంటే నేరుగా బస్సులేకపోవడం వల్ల ముద్దనూరు దిగి వెళ్లాల్సి ఉందన్నారు. రైలు సర్వీసులు కడప-గుంటూరు, ధర్మవరం ఎక్స్‌ప్రెస్, నంద్యాల డెమో రైలు వంటివి జమ్మలమడుగులో స్టాపింగ్ ఉందని, ప్రజలు టౌన్‌లోకి రావాలన్నా, టౌన్ నుండి రైల్వేస్టేషన్‌కు వెళ్లాలన్నా రవాణా ఖర్చులు అవుతున్నాయని పేర్కొన్నారు. రైలు ప్రయాణం సమయాల్లో బస్సు సౌకర్యం కల్పిస్తే ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు. జమ్మలమడుగు-ప్రొద్దుటూరు నాన్‌స్టాప్ సర్వీసులు ప్రయాణ సమయం సుమారు గంట పడుతోందని విద్యార్థులు, ఉద్యోగస్తులు, ఇతర ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమయం కుదించి త్వరగా వెళ్లేలా చూడాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో పాముల బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

బోధన పరికరాలపై అవగాహన

కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సివి రామన్ సైన్సు క్లబ్ అధ్వర్యంలో సైన్స్ ఉపాధ్యాయులకు బోధనాపరికరాలపై అవగాహన కల్పిచారు. స్థానిక వైవిఎస్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల హైస్కూల్‌లో శనివారం ప్రొద్దుటూరు డివిజన్ ఉపాధ్యాయులకు విషయ నిపుణులు నరేష్ వివిధ రకాల ప్రయోగాల, పరికరాల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమం సైన్స్ క్లబ్ జిల్లా కన్వీనర్ విజయమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పాఠ్యాంశాలను సులభతరంగా బోధించే దానికి ఈ కార్యక్రమం చాలా ఉపయోగపడుతుందన్నారు. క్లబ్ సెక్రటరీ కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ సివి రామన్ సైన్స్‌క్లబ్ తరపున సైన్స్ టూర్, సైన్స్ ఉపాధ్యాయులకు ప్రతి రెండవ శనివారం వివిధ సైన్సు అంశాల మీద అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి క్లబ్ సలహాదారులు ప్రధానోపాధ్యాయులు రవిప్రకాష్, గోపీనాథ్‌రెడ్డి, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు శ్రీరాములు, కాశీ ప్రసాద్‌రెడ్డి, వివిధ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే పేదరికం నిర్మూలన

-జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి ఎ.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప సిటీ

విద్యతోనే పేదరికం నిర్మూలన సాధ్యమని జుల్లా సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ అధికారి ఎ ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు శనివారం గ్లోబల్ ఇంజినీరింగ్‌కళాశాలలో నిర్వహిస్తున్న మహిళా శిశు సంక్షేమ శాఖలో పనిచేస్తున్న చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్స్, సూపర్‌వైజర్లకు, ఉపాధ్యాయులకు ఆరు రోజులపాటు రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పిఒతోపాటు, రాష్ట్ర పర్యవేక్షకురాలు కల్పనా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆరోగ్యంగా, మానసికంగా బాగా ఉన్నప్పుడ అభ్యసన స్థాయి పెరుగుతందని చెప్పారు. విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం, జ్ఞానంతో పాటు లోకజ్ఞానం పెంపొందించే దిశగా విద్యాబోధన ఉండాలని చెప్పారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడూ శిక్షణను పొంది నాణ్యమైన విద్యాబోధనకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర పర్యవేక్షకురాలు మాట్లాడుతూ మూడు నుంచి ఎనిమిది సంవత్సరాల వయస్సు గల పిల్లలు అందరూ తప్పకుండా చదవడం, రాయడం,-చతుర్విద ప్రక్రియలను చేయగలిగేలా చేయడం శిక్షణ ముఖ్య ఉద్దేశమన్నారు. కావున శిక్షణలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ మండల స్థాయిలో జరిగే శిక్షణ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అకాడమీక్ మానిటరింగ్ అధికారి ధనలక్ష్మి, రామాంజనేయ రెడ్డి, విజయ లక్ష్మి, కీ రిసోర్స్ పర్సన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

ఉరుసు ఉత్సవంలో ఖవ్వాలి గాయకులు

భక్తి శ్రద్ధలతో ఉరుసు మహోత్సవం

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని స్థానిక ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఉన్న దర్గాలో గందోత్సవం, ఉరుసు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఉరుసు ఉత్సవంలో మతసామరస్యానికి ప్రతీకగా హిందూ, ముస్లిములు ఐక్యంగా పాల్గొన్నారు. ఖవ్వాలిని అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు నిర్వాహకులు అన్వర్ బాషా తెలిపారు. ఉరుసులో మహోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసు కోకుండా ఎస్ఐ తిప్పేస్వామి పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించినట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తూ గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో శనివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తూ గడ్డివామి దగ్ధమైంది. ఈ విషయం గుర్తించిన ఇంటి యజమాని గొబ్బిళ్ళ పెంచలయ్య రాజంపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేశారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ గడ్డివామి విలువ రూ.25 వులు ఉంటుందని, ప్రభుత్వమే ఆదుకోవాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయుల సంక్షేమం పట్టని ప్రభుత్వం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్క రించడంలో ప్రభుత్వ నిరంకుశ వైఖరి మారకపోతే ఉద్యమం చేపట్టక తప్పదని ఎస్‌టియు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి పేర్కొన్నారు. పులివెందులలోని రమణప్ప సత్రం(సత్రం బడి) పాఠ శాలలో శనివారం రీజనల్ కన్వీనర్ జి.మల్లేష్ అధ్యక్షతన నిర్వ హించిన వార్షిక కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో తీవ్ర ఆందోళన, మానసిక వేదనతో బతుకులు వెళ్లదీయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేయకుండా చర్చల పేరుతో కాలయాపన చేసి, తీరా ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో ప్రత్యామ్నాయంగా జిపిఎస్‌ను అమలు చేస్తామనడం తగదన్నారు.వెంటనే జిఒ నెంబరు 117ను రద్దు చేయాలన్నారు. అనంతరం జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా మౌలానా ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పిం చారు.కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.దాదాపీర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శంకర్‌రెడ్డి, నాగేంద్ర, ఎంఇఒ రామానాయుడు, జిల్లా బాధ్యులు బండి సుధాకర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మునిబాబు, సీనియర్ నాయకులు శివరామిరెడ్డి, ప్రసాదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు కూరగాయలు పంపిణీ

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

మండల పరిధిలోని మలకాటపల్లి వద్ద మదరసాల అధినేత అబ్దుల్ సుభాన్ హిందూ, ముస్లిమ్ నిరుపేదలకు వృద్ధులకు, పిల్లలకు ,వికలాంగులకు ఒకొక్కరికి శనివారం రూ. 500 కూర గాయలు ఉచితంగా పంపిణీ చేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కరోనా నుంచి ప్రతినెలా రెండో శనివారం మానవ దృక్పథంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని చెప్పారు. చాలా మంది పేద విద్యా ర్థులకు ఉచిత విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఆకలితో ఉన్న వారిని ఆదు కోవడం, కరోనా సమయం లోనూ కరోనా జబ్బుకు ఎన్నో ఉచితమైన మం దులు అందించామని, నిత్యా వసర వంట సరుకులు అందించామని పేర్కొ న్నారు. నేటి ప్రపంచంలో నేడు మానవాళికి శాంతి కరువైందని అశాంతితో ఎంతో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. అందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో పేదలు, వృద్ధులు, వికలాంగులు, పాల్గొన్నారు.

సమస్యలు కొనితెచ్చుకోవద్దు

ప్రజాశక్తి-కాశినాయన

గ్రామాలలో కక్షలు పెంచుకుని సమస్యలు తెచ్చుకోవద్దని ఎస్ఐ అమర్‌నాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం నరసాపురంలో ప్రజలకు అసాంఘిక కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామాలలో రాజకీయ కక్షలు, గ్రూపు రాజకీయాలు, అనసరవమైన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం చేయరాదని తెలిపారు. మనసులో ఎవరికి అభిమానం ఉంటే వారికే ఓటు వేసుకొని సంతోషంగా ఉండాలన్నారు మద్యం సేవించి ఇతరులను ఇబ్బంది పెట్టవద్దని తెలిపారు. ప్రజలంతా శాంతి, సమాధానంతో జీవించాలని ఆకాంక్షించారు. సోదరభావాన్ని పెంపొందించు కోవాలని సూచించారు. అలాంటి వారిపై కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

31 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలో గుండాలపల్లిలో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 31 మద్యం బాటిళ్లను స్వాదీనం చేసుకున్నట్లు ఎస్ఐ డాక్టర్ నాయక్ తెలిపారు. నల్లన్‌శెట్టి పెంచలయ్య అనే వ్యక్తి నుంచి 20 మద్యం బాటిళ్లు, కోడూరు గాంధీనగర్ కు చెందిన షేక్‌మస్తాన్ అనే వ్యక్తి నుంచి 11 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఐదుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలోని రాఘవరాజుపురం కాపల్లె గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో దాడులు చేసి పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.2170 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రూ.2 లక్షల విలువైన టపాసులు సీజ్

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో అక్రమంగా అమ్మకాలు జరుగుతున్న టపాసుల గోదాముపై దాడులు జరిపి రూ.2 లక్షల విలువ చేసే టపాకాయలు సీజ్ చేసినట్లు సిఐ మోహన్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక చిత్తూరు రోడ్డులోని శ్రీకాకతీయ స్కూలుకు సమీపంలో సాంబశివారెడ్డి ఎలాంటి అనుమతులు లేకుండా తన ఇంట్లోనే రెండు లక్షల రూపాయల విలువ చేసే టపాకాయలను నిలువచేసి అమ్మకాలు సాగిస్తున్న సమాచారం అందుకుని దాడులు చేశామన్నారు. ఈ సందర్భంగా పెద్ద మనుషుల సమక్షంలో టపాసులు సీజ్ చేసి, కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో అగ్నిమాపక అధికారి మస్తాన్, విఆర్ఓలు శిల్ప, ఎర్రయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టపాసులను సీజ్ చేస్తున్న పోలీసులు